క్లుప్తంగా

అభివృద్ధే లక్ష్యంగా పనిచేయండి



సీసీ రోడ్డు పనులను పరిశీలిస్తున్న జెడ్పీ చైర్మన్ శ్రీనివాసులు

వి.కోట: మండలంలో అభివృద్ధి పనులు నాణ్యతా ప్రమాణాలతో త్వరితగతిన పూర్తిచేయాలని జెడ్పీ చైర్మన్ శ్రీనివాసులు ఆదేశించారు. సోమవారం ఆయన మండలంలోని పి.కొత్తూరులో జెడ్పీ నిధులతో నిర్మిస్తున్న మురుగు కాలువల నిర్మాణ పనులను పరిశీలించారు. ప్రతి గ్రామంలో సీసీ రోడ్ల పనులు వేగంగా చేస్తున్నట్టు చెప్పారు. గ్రామాల్లో ప్రజలకు ఎలాంటి ఇబ్బందులు లేకుండా రోడ్ల పనులు చేయాలని సూచించారు.

తహసీల్దార్‌ను కలిసిన ఎంపీపీ

పెద్దపంజాణి: తహసీల్దార్‌గా బాధ్యతలు స్వీకరించిన లోకేశ్వర రావును ఎంపీపీ ఎన్.రెడ్డెప్ప సోమవారం మర్యాద పూర్వకంగా కలిశారు. ఆయన్ను సన్మానించారు. రెవెన్యూ సంబంధిత సమస్యలను ఎప్పటికప్పుడు పరిష్కరించాలని కోరారు.

ఎంఈఓలకు సన్మానం



ఎంఈఓలను సన్మానిస్తున్న ఎస్టీయూ నాయకులు

పుంగనూరు: పుంగనూరు నూతన ఎంఈఓలుగా బాధ్యతలు చేపట్టిన చంద్రశేఖర్‌రెడ్డి, రెడ్డెన్నశెట్టితో పాటు ప్రస్తుతం ఇక్కడ పని చేస్తున్న ఎంఈఓ కేశవరెడ్డిని ఘనంగా సన్మానించారు. సోమవారం సాయంత్రం ఎంఈఓ కార్యాలయంలో ఎస్టీయూ నాయకులు హరికిషోర్‌రెడ్డి, మోహన్, బుడ్డన్న, శ్రీధర్, సుబ్రమణ్యం ఆధ్వర్యంలో ఎంఈఓలకు శాలువలు కప్పి సన్మానించారు. ఎంఈఓలు మాట్లాడుతూ పుంగనూరులో ప్రభుత్వ పాఠశాలల్లో విద్యాబోధన పటిష్టంగా నిర్వహించేందుకు ఉపాధ్యాయులు కృషి చేయాలన్నారు. జిల్లాలో పుంగనూరును మొదటి స్థానంలో నిలిపేందుకు సహకరించాలని కోరారు.

రొంపిచెర్ల ఎంఈఓగా ఇందిర

రొంపిచెర్ల: రొంపిచెర్ల మండల విద్యాశాఖ అధికారి-1గా ఇందిర సోమవారం బాధ్యతలు స్వీకరించారు. పదోన్నతులలో భాగంగా కార్వేటినగరం ఉన్నత పాఠశాల హెచ్ఎంగా పని చేస్తున్న ఇందిరను రొంపిచెర్ల ఎంఈఓగా బదిలీ చేశారు. ఇక్కడ పని చేస్తున్న హసన్ బాషా చిత్తూరు ఉన్నత పాఠశాలకు వెళ్లారు. ఎంఈఓ ఇందిర మంగళవారం ఎంపీపీ చిచ్చిలి పురుషోత్తం రెడ్డి, జెడ్పీటీసీ రెడ్డీశ్వర్ రెడ్డిని మర్యాద పూర్వకంగా కలిశారు.

అట్టహాసంగా క్రీడాపోటీలు



టోర్నీ విజేత జట్టుతో నిర్వాహకులు

సోమల: మండలంలోని ఎస్.నడింపల్లె పంచాయతీ కరకమందలో గత రెండు రోజులుగా ప్రేరణ స్పోర్ట్స్ అకాడమీ నిర్వాహకుడు ఉదయ్ కుమార్ ఆధ్వర్యంలో నిర్వహించిన జిల్లాస్థాయి వాలీబాల్, క్రికెట్, 5కె రన్ పోటీలు అట్టహాసంగా జరిగాయి. క్రికెట్ పోటీల్లో కరకమంద జట్టు విన్నర్‌గా, రన్నర్స్‌గా సోమల జట్టు నిలవగా, వాలీబాల్ పోటీల్లో విజేతగా వీ.కోట జట్టు, రన్నర్స్‌గా పొదలగుంటపల్లె జట్టు నిలిచాయి. అలాగే ఈ నెల 22న ఇండోర్ బ్యాడ్మింటన్ పోటీలను నిర్వహిస్తున్నట్లు నిర్వాహకుడు ఉదయ్ తెలిపారు. విజేతలకు మాజీ వైస్ ఎంపీపీ లలితమ్మ, వైఎస్సార్‌సీపీ సీనియర్ నేత వాసు దేవకుమార్ బహుమతులను ప్రదానం చేశారు. అనంతరం వారు మాట్లాడుతూ గ్రామీణ ప్రాంతాల్లో యువతకు క్రీడల పట్ల ఆసక్తి పెంచడానికి ఇలాంటి పోటీలను నిర్వహించడం అభినందనీయమన్నారు. నిర్వాహకులు ఉదయ్‌కుమార్, హిమబిందును యువత, క్రీడాకారులు ఘనంగా సన్మానించారు. చైతన్య, మనోజ్‌కుమార్, రవికుమార్, జయప్రకాష్, టీచర్ దామోదరం పాల్గొన్నారు.

మధ్యాహ్న భోజనం పరిశీలన

సోమల: రాష్ట్రప్రభుత్వం జగనన్న గోరుముద్ద పథకంలో భాగంగా విద్యార్థులకు అందిస్తున్న మధ్యాహ్న భోజనం అందించడంలో మెనూ తప్పక పాటించాలని ఎంఈఓ-2 శివరత్నమ్మ ఆదేశించారు. సోమవారం మండలంలోని ఇరికిపెంట పంచాయతీ ఎర్రనాగులవారిపల్లె ప్రాథమికోన్నత పాఠశాల, మేటిమంద ప్రాథమిక పాఠశాలను ఆమె తనిఖీ చేశారు. ఈ సందర్భంగా విద్యార్థులకు అందిస్తున్న భోజనాన్ని పరిశీలించారు. అనంతరం విద్యార్థుల హాజరుతో పాటు ఉపాధ్యాయుల హాజరు, మిడ్ డే మిల్స్ రికార్డులు పరిశీలించి పలు సూచనలు ఇచ్చారు. ప్రభుత్వం నిర్దేశించిన మేరకు ప్రణాళికాబద్ధంగా పాఠ్యాంశాలను బోధించాలని టీచర్లకు సూచించారు.

కుష్టువ్యాధిపై అవగాహన

రామకుప్పం: కుష్టు వ్యాధిపై అవగాహన కలిగి ఉండాలని విజలాపురం పీహెచ్‌సీ వైద్యాధికారి ఆల్తాఫ్ హుస్సేన్ అన్నారు. సోమవారం ఆనిగానూరు వాసులకు కుష్టు వ్యాధిపై అవగాహన కల్పించారు. ఎవరికైనా స్పర్శలేని మచ్చలు, ముఖం, చెవులు, ఎద, వీపు మీద నొప్పిలేని బుడిపెలు ఉంటే వెంటనే స్థానిక పీహెచ్‌సీలో చూపించుకోవాలన్నారు. ఎండీటీ చికిత్స ద్వారా కుష్టువ్యాధిని పూర్తిగా నయం చేయవచ్చన్నారు. అనంతరం డాక్టర్ సాదియా మాట్లాడారు. వైద్యసిబ్బంది పాల్గొన్నారు.

నవరత్నాలతో పేదలకు సంక్షేమ ఫలాలు

- 'గడప గడపకు మన ప్రభుత్వం'లో ఎమ్మెల్యే వెంకటేగౌడ



బీటీ రోడ్డును రిబ్బన్ కట్ చేసి ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే



దివంగత వైఎస్సార్ విగ్రహాన్ని ఆవిష్కరిస్తున్న ఎమ్మెల్యే వెంకటేగౌడ

గంగవరం: నవరత్నాలతో పేద కుటుంబాలకు సంక్షేమ ఫలాలను తమ ప్రభుత్వం అందించిందని, గడచిన నాలుగేళ్ల పాలనలో ఒక్కో ఇంటికి పథకాల రూపేణా లక్షలాది రూపాయల లబ్ధి చేకూర్చిందని ఎమ్మెల్యే వెంకటేగౌడ అన్నారు. సోమవారం మండలంలోని జీడిమాకులపల్లె, కొంగోళ్లపల్లె గ్రామాల్లో గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమాన్ని ఎమ్మెల్యే నిర్వహించారు. ఇంటింటికీ వెళ్లి ప్రజలను పలకరించారు. ఆయా కుటుంబాలు పొందిన పథకాల లబ్ధిని సంక్షేమ బుక్‌లెట్లతో వివరించారు. రూ.40 లక్షలతో నూతనంగా నిర్మించిన గ్రామ సచివాలయ భవనాన్ని ప్రారంభించారు. ప్రజలు తన దృష్టికి తీసుకువచ్చిన ప్రజా సమస్యలను సంబంధిత అధికారులు పరిష్కరించాలని ఆదేశించారు. జగనన్న సురక్ష పథకంతో అవసరమైన సేవలు పొందాలని ప్రజలకు సూచించారు. క్షగత టీడీపీ ప్రభుత్వం ఒక్క హామీ కూడా నెరవేర్చలేదని, ప్రస్తుత సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ఇళ్ల ముంగిటకే పథకాలు, సేవలు అందిస్తూ సుపరిపాలన అందిస్తున్నారన్నారు. ముఖ్యమంత్రికి ప్రజల ఆశీర్వాదాలు ఎప్పటికీ ఉండాలని కోరారు.

దివంగత వైఎస్సార్ విగ్రహావిష్కరణ

జీడిమాకులపల్లె కూడలి వద్ద పంచాయతీ వైఎస్సార్‌సీపీ నాయకులు ఏర్పాటు చేసిన దివంగత మహానేత వైఎస్ రాజశేఖరరెడ్డి విగ్రహాన్ని ఎమ్మెల్యే ఆవిష్కరించారు. గజమాల వేసి ఘన నివాళులు అర్పించారు.

బీటీ రోడ్డు ప్రారంభం

పలమనేరు- బెంగళూరు హైవే ఆనుకుని జీఎల్ఎస్ఫారం ఫ్లైఓవర్ నుంచి జీడిమాకులపల్లె, కొంగోళ్లపల్లె గ్రామాల మీదుగా దండపల్లె రోడ్డు వరకూ 2.5 కిలోమీటర్ల తారురోడ్డును ఈఏపీ గ్రాంట్స్ రూ. 2.6 కోట్లతో పూర్తి చేశారు. ఈ రోడ్డును స్థానిక నాయకులతో కలిసి ఎమ్మెల్యే ప్రారంభించారు. కార్యక్రమంలో ఏఎంసీ చైర్మన్ హేమంత్‌రెడ్డి, మండల పార్టీ కన్వీనర్ మోహన్‌రెడ్డి, ఏఎంసీ మాజీ చైర్మన్ ప్రహ్లాద, ఎంపీపీ వెంకటరమణ, జెడ్పీటీసీ సభ్యురాలు పార్వతి, సర్పంచ్ శ్యామల, ఎంపీటీసీ సుమిత్రమ్మ, సర్పంచుల సంఘం అధ్యక్షుడు గిరిరాజారెడ్డి, నాయకులు చంద్రప్ప, శ్రీరాములురెడ్డి, చలపతిరెడ్డి, సచివాలయాల మండల కన్వీనర్ వినోద్‌రెడ్డి, రెడ్డెప్ప, నరసింహారెడ్డి, హేమాద్రిరెడ్డి, వైస్ సర్పంచ్ వాసుదేవరెడ్డి, సుబ్రమణ్యంరెడ్డి, వెంకటేష్‌రెడ్డి, దామోదర్‌రెడ్డి, వివిధ శాఖల అధికారులు, సచివాలయ ఉద్యోగులు, గ్రామ వలంటీర్లు పాల్గొన్నారు.

నేడు చందమామగుండ్లులో..

చందమామగుండ్లు గ్రామంలో మంగళవారం ఉదయం 6 గంటల నుంచి గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమాన్ని ఎమ్మెల్యే నిర్వహిస్తారని ఎంపీడీఓ తాజ్‌మస్రూర్ తెలిపారు.

అధికారులు అందుబాటులో ఉండాలి : ఎంపీపీ

- అందుబాటులో ఉండని పశువైద్యాధికారి
- మండల సమావేశంలో సభ్యుల మండిపాటు



మాట్లాడుతున్న ఎంపీపీ మొగసాల రెడ్డెప్ప

బైరెడ్డిపల్లె: అధికారులు సచివాలయాల్లో ప్రజలకు అందుబాటులో ఉంటూ అర్హులందరికీ సంక్షేమ పథకాలు అందించేందుకు కృషి చేయాలని ఎంపీపీ మొగసాల రెడ్డెప్ప అన్నారు. స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో సోమవారం సర్వ సభ్య సమావేశం నిర్వహించారు. తీర్థం పరిసర ప్రాంతాల్లో అధికంగా రైతులు పాడి ఆవులపై ఆధారపడి జీవిస్తున్నారని, అక్కడి పశు వైద్యాధికారి అందుబాటులో ఉండటం లేదని సర్పంచ్ జ్యోతమ్మ, ఎంపీటీసీ రవీంద్రమ్మ ఆగ్రహం వ్యక్తం చేశారు. పశువైద్యాధికారిపై ఉన్నతాధికారులకు ఫిర్యాదు చేస్తామని ఎంపీపీ తెలిపారు. ఆయన మాట్లాడుతూ గ్రామాల్లో వీధిదీపాలు, తాగునీరు, మురుగులు కాలువల శుభ్రతపై ప్రత్యేక దృష్టి సారించాలన్నారు. కొంత మంది సచివాలయ సిబ్బంది అందుబాటులో ఉండడం లేదని ఫిర్యాదులు వస్తున్నాయని, విధి నిర్వహణలో నిర్లక్ష్యం చేస్తే చర్యలు తప్పవని హెచ్చరించారు. మండలానికి మంజూరైన 1,945 గృహాల్లో 955 పూర్తి అయ్యాయన్నారు. మిగిలిన గృహాల నిర్మాణం పూర్తి చేసేందుకు సంబంధిత అధికారులు చర్యలు తీసుకోవాలన్నారు. వర్షాలు తక్కువగా కురుస్తుండడంతో సాగులో ఉన్న పంటలకు ఈ-క్రాప్ నమోదు తప్పనిసరిగా చేయాలని వ్యవసాయశాఖ అధికారులకు సూచించారు. సమావేశంలో ఎంపీడీఓ రాజేంద్రబాలాజీ, వైస్ ఎంపీపీలు నారాయణస్వామి, రూప, మండల స్థాయి అధికారులు, పలువురు ప్రజాప్రతినిధులు పాల్గొన్నారు.

తీరిన తాగునీటి సమస్య



ఏర్పాటు చేస్తున్న నూతన పైపులైన్

సదుం: మండలంలోని అమ్మగారిపల్లె పంచాయతీ కలకటవారిపల్లె ఎస్సీ కాలనీ వాసులు గత కొన్ని రోజులుగా తాగునీటికి ఇబ్బందులు పడుతున్నారు. విషయం తెలిసి సర్పంచ్ వరలక్ష్మి తాగునీటి సమస్యను శాశ్వతంగా పరిష్కారం అయ్యేలా సోమవారం నూతన పైపులైను ఏర్పాటు చేశారు. కాలనీలో నీటి సమస్య తీరడంతో గ్రామస్తులు హర్షం వ్యక్తం చేశారు. కార్యక్రమంలో సింగిల్‌విండో వైస్ చైర్మన్ రమేష్‌రెడ్డి పాల్గొన్నారు.

తాగునీటి బోరు ఏర్పాటు



బోరు డ్రిల్లింగ్ పనుల్లో వైఎస్సార్ సీపీ నేతలు

రామకుప్పం: మేజర్ గ్రామ పంచాయతీ రామకుప్పం పరిధిలోని అయ్యప్పగానిపల్లిలో సోమవారం నూతన బోరు వేశారు. గ్రామంలో తాగునీటి సమస్య ఉండడంతో స్పందించిన ఎంపీపీ సుబ్రమణ్యం మండల పరిషత్ నిధులతో బోరు మంజూరు చేశారు. స్థానిక సర్పంచ్ మురళీకృష్ణ ఆధ్వర్యంలో నూతన బోరు డ్రిల్ చేశారు. తాగునీటి సమస్యను పరిష్కరించిన ఎంపీపీ, సర్పంచ్‌ను స్థానికులు అభినందించారు. కార్యక్రమంలో వైఎస్సార్ సీపీ మండల కో కన్వీనర్ చంద్రారెడ్డి, టౌన్ అధ్యక్షుడు అప్పి, స్థానిక నేతలు నారాయణస్వామి, రవి, బోర్‌వెల్ చెంగారెడ్డి, కేశవరెడ్డి, జయప్ప పాల్గొన్నారు.

అర్హులందరికీ ప్రభుత్వ పథకాలు



మండల సమావేశంలో మాట్లాడుతున్న నేతలు

గుడుపల్లె: అర్హులందరికీ ప్రభుత్వ పథకాలు అందేలా చూడాలని ఎంపీపీ వరలక్ష్మి తెలిపారు. స్థానిక స్త్రీశక్తి భవనంలో సోమవారం మండల సాధారణ సర్వసభ్య సమావేశం నిర్వహించారు. ఆమె మాట్లాడుతూ జగనన్న సురక్ష కార్యక్రమం ద్వారా ప్రజలకు 11 రకాల సేవలను ఉచితంగా అందిస్తున్నామన్నారు. పట్టభద్రుల ఎమ్మెల్సీ కలిచర్ల శ్రీకాంత్ మాట్లాడుతూ పేదల సంక్షేమమే ధ్యేయంగా ప్రభుత్వం పరిపాలన సాగిస్తోందన్నారు. అధికారులు కూడా అందుకు అనుగుణంగా ప్రజలకు ప్రభుత్వ సేవలను అందించాలని సూచించారు. ఉపాధిహామీ పథకంలో అవకతవకలకు పాల్పడిన ఫీల్డ్ అసిస్టెంట్‌లను తొలగించాలని సూచించారు. కార్యక్రమంలో జెడ్పీటీసీ క్రిష్ణమూర్తి, వైస్ ఎంపీపీలు శ్రీనివాసులు, యువలక్ష్మి, ఎంపీడీవో శ్రీనివాసులు, ఈవోపీఆర్‌డీ శంకర్ పాల్గొన్నారు.

గడ్డివిత్తనాలు పంపిణీ

పులిచెర్ల(కల్లూరు): మండలంలోని మతుకువారిపల్లెలో సోమవారం పశుసంవర్థక శాఖ ఆధ్వర్యంలో సబ్సిడీ ధరలతో రైతులకు మొక్కజొన్న, జొన్న విత్తనాలను స్థానిక సర్పంచ్ ప్రతాప్ రెడ్డి చేతుల మీదుగా అందజేశారు. ఒక్కో రైతుకు ఐదు కేజీల విత్తనాలను పంపిణీ చేసినట్లు చెప్పారు. ప్రస్తుతం వర్షాలు పడుతుండడంతో పశువులకు మేత కొరత లేకుండా ఉండేందుకు ప్రభుత్వం ఈ విత్తనాలను సరఫరా చేసిందన్నారు.

ప్రజలకు సేవలు అందించడానికే జగనన్న సురక్ష



పుంగనూరు: లబ్ధిదారులకు ధ్రువపత్రాలు ఇస్తున్న మున్సిపల్ చైర్మన్ అలీమ్‌బాషా

పుంగనూరు: రాష్ట్రప్రభుత్వం ప్రవేశపెట్టిన జగనన్న సురక్ష పథకంతో ప్రజలకు మరింత చేరువలో సేవలు అందించడమే లక్ష్యమని మున్సిపల్ చైర్మన్ అలీమ్‌బాషా అన్నారు. సోమవారం స్థానిక ఎస్ఎస్ పేటలోని హనుమంతురాయుని సన్నిధిలో జగనన్న సురక్ష కార్యక్రమాన్ని వైస్ చైర్మన్ సీఆర్.లలిత, కౌన్సిలర్లు రాఘవేంద్ర, రామకృష్ణంరాజుతో కలిసి నిర్వహించారు. ఈ సందర్భంగా ధ్రువీకరణపత్రాలను లబ్ధిదారులకు అందజేశారు. చైర్మన్ మాట్లాడుతూ జగనన్న సురక్షలో భాగంగా క్యాంపుల వద్ద ప్రజలకు అన్ని రకాల ధ్రువీకరణ పత్రాలతో పాటు మొత్తం 11 రకాల సేవలు అందిస్తున్నామని తెలిపారు. మంత్రి పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డి, ఎంపీ మిథున్‌రెడ్డి ఆదేశాల మేరకు సురక్ష కార్యక్రమాన్ని పట్టణంలోని 31 వార్డుల్లో నెల రోజులలోపు సమగ్రంగా నిర్వహించేలా ప్రణాళికలు సిద్ధం చేశామన్నారు. కార్యక్రమంలో మున్సిపల్ కమిషనర్ నరసింహప్రసాద్‌రెడ్డి, మున్సిపల్ మేనేజర్ రసూల్‌ఖాన్, సచివాలయాల కన్వీనర్ వరదారెడ్డి, స్థానిక నాయకులు సలామత్, నవీన్‌కుమార్‌రాజు, ఖాన్‌సాబ్ తదితరులు పాల్గొన్నారు.

నేడు జగనన్న సురక్ష క్యాంపులు

శాంతిపురం: జగనన్న సురక్ష కార్యక్రమంలో భాగంగా మంగళవారం ఎం.కె.పురం, కొలమడుగు గ్రామ సచివాలయాల్లో ప్రత్యేక శిబిరాలు నిర్వహిస్తున్నట్టు ఎంపీడీవో హేమమాలిని తెలిపారు. సర్వేలో గుర్తించిన సమస్యల పరిష్కారానికి అవసరమైన సర్టిఫికెట్లను ఉచితంగా జారీ చేస్తామన్నారు. ముందుగా టోకెన్ తీసుకోని వారు కూడా నేరుగా వచ్చి అవసరమైన ధ్రువీకరణ పత్రాలు పొందవచ్చని చెప్పారు.

సీఎం, మంత్రి చిత్రపటాలకు పాలాభిషేకం



తూర్పుమొగశాలలో సీఎం జగన్ చిత్రపటానికి పాలాభిషేకం చేస్తున్న దళిత నేతలు

పుంగనూరు: రాష్ట్ర ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి, మంత్రి పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డి చిత్రపటాలకు సోమవారం దళిత నాయకులు పాలాభిషేకం చేశారు. ఏపీ రాష్ట్ర దళిత సంక్షేమ సేవాసంఘం అధ్యక్షుడు ఎం.శంకరప్ప, దళిత నాయకులు రాజు, పెంచుపల్లి కృష్ణ ఆధ్వర్యంలో 14వ వార్డులోని తూర్పుమొగశాలలో దళిత నాయకులు లబ్ధిదారులతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా శంకరప్ప మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం అందిస్తున్న నవరత్నాల పథకాలతో పేదలు ఎంతో ఆర్థికంగా అభివృద్ధి చెందారన్నారు. ఇంకా ఎవరికైనా ప్రభుత్వ పథకాలు అందకపోతే వారికి కూడా అందించాలనే సదుద్దేశంతో జగనన్న సురక్ష లాంటి మహత్తర కార్యక్రమానికి శ్రీకారం చుట్టిన ఘనత వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డిదే అన్నారు. ఆయనున మరోసారి ముఖ్యమంత్రిని చేసుకునేందుకు ప్రతి ఒక్కరూ ఐకమత్యంతో పని చేయాలని కోరారు. కార్యక్రమంలో వైఎస్సార్‌సీపీ నాయకులు కిషోర్, చంద్రప్ప, మంజుల, శంకరప్ప తదితరులు పాల్గొన్నారు.

డప్పు కళాకారులకు గుర్తింపు కార్డుల పంపిణీ



పులిచెర్ల ఎంపీడీఓ కార్యాలయంలో..



రొంపిచెర్లలో..

పులిచెర్ల(కల్లూరు): మండలంలోని డప్పు కళాకారులకు సోమవారం పులిచెర్ల ఎంపీడీఓ కార్యాలయంలో ఎంపీపీ సురేంద్రనాథరెడ్డి, జెడ్పీటీసీ మురళీధర్ చేతుల మీదుగా గుర్తింపు కార్డులను పంపిణీ చేశారు. కార్యక్రమంలో నాయకులు నాదమునిరెడ్డి, గోవిందరెడ్డి, ప్రభాకర్, కోదండ, ఆనందరెడ్డి, సర్పంచ్ కృష్ణయ్య తదితరులు పాల్గొన్నారు.

రొంపిచెర్ల: మండలంలో 20 మంది డప్పు కళాకారులకు గుర్తింపు కార్డులను అందజేసినట్లు ఎంపీపీ చిచ్చిలి పురుషోత్తం రెడ్డి తెలిపారు. సోమవారం స్థానిక ఎంపీడీఓ కార్యాలయంలో ఆయన కళాకారులకు గుర్తింపు కార్డులు అందజేశారు. అనంతరం ఆయన మాట్లాడుతూ, డప్పు కళాకారులకు త్వరలోనే పెన్షన్ కూడా మంజూరు చేస్తామన్నారు. కార్యక్రమంలో జెడ్పీటీసీ రెడ్డీశ్వర్ రెడ్డి, సింగిల్‌విండో అధ్యక్షుడు దేవులపల్లె హరినాథరెడ్డి, డాక్టర్ శ్రీనాథ్, సర్పంచ్‌లు ఇబ్రహీంఖాన్, నాగిరెడ్డి, జీవలత, హేమలత, నాయకులు పాల్గొన్నారు.

భూమి పూజ



బీఎంసీ నిర్మాణానికి చేస్తున్న భూమి పూజ

పలమనేరు: పట్టణ సమీపంలోని గంటావూరు వద్ద రూ.30లక్షలతో నిర్మించనున్న బల్క్ మిల్క్ సెంటర్ నిర్మాణ పనులు సోమవారం భూమిపూజతో ప్రారంభమయ్యాయి. వెలుగు మండల సమాఖ్య నిధులతో ఈ భవనాన్ని నిర్మిస్తున్నారు. కార్యక్రమంలో ఏఎంసీ చైర్మన్ హేమంత్‌కుమార్ రెడ్డి, నాయకులు రాజారెడ్డి, చెంగారెడ్డి, భాస్కర్‌రెడ్డి తహసీల్దార్ కుప్పుస్వామి, సీసీలు, మండల సమాఖ్య అధ్యక్షురాలు రెడ్డివారి క్రిష్ణవేణి, సమాఖ్య ప్రతినిధులు పాల్గొన్నారు.

భక్తిశ్రద్ధలతో గురుపౌర్ణమి

- షిర్డీ సాయిబాబా ఆలయాల్లో ప్రత్యేక పూజలు
- పోటెత్తిన భక్తజనం



గంగవరం : కీలపట్లలో ఊంజల్ సేవ



తల్లిదండ్రులకు పాద పూజ చేస్తున్న విద్యార్థులు

గంగవరం: గురు పౌర్ణమి సందర్భంగా మండలంలోని టీటీడీ అనుబంధ కీలపట్ల శ్రీ కోనేటిరాయ స్వామి ఆలయంలో శ్రీదేవి భూదేవి సమేత స్వామి వారికి సోమవారం సాయంత్రం ఉయ్యాలసేవ మంగళ వాయిద్యాలు, వేద మంత్రోచ్ఛరణల నడుమ నిర్వహించారు. హిందూ ధర్మ ప్రచార పరిషత్ కళాకారులు అన్నమాచార్య సంకీర్తనలు ఆలపించారు. అనంతరం గ్రామ వీధుల్లో గ్రామోత్సవం నిర్వహించారు. కార్యక్రమంలో ఆలయ పర్యవేక్షకులు గజేంద్ర, అర్చకులు, భక్తులు పాల్గొన్నారు.

ఘనంగా గురు పౌర్ణమి వేడుకలు

కుప్పం: పట్టణంలోని సాయిబాబా మందిరాల్లో సోమవారం గురు పౌర్ణమి వేడుకలను ఘనంగా నిర్వహించారు. హెచ్‌పీ రోడ్డు, మోడల్ కాలనీ, ఎంఎఫ్‌సీ ప్రభుత్వ జూనియర్ కళాశాల, రైల్వే గేటు తదితర ప్రాంతాల్లో ఉన్న షిరిడీ సాయిబాబా మందిరాల్లో ప్రత్యేక పూజలు చేశారు. మధ్యాహ్నం భక్తులకు అన్నదానం చేశారు. మోడల్ కాలనీలో సాయంత్రం ప్రాకారోత్సవం నిర్వహించారు.

ఘనంగా గురుపౌర్ణమి పూజలు

రామకుప్పం: మండలకేంద్రమైన రామకుప్పంలోని షిరిడీ సాయిబాబా ఆలయంలో సోమవారం గురు పౌర్ణమి సందర్భంగా ప్రత్యేక పూజలు చేశారు. భక్తులు స్వహస్తాలతో బాబాకు పాలాభిషేకం చేశారు. మంగళ హారతి ఇచ్చారు. మధ్యాహ్నం అన్నదానం చేశారు. రాత్రి బాబాను పల్లకిలో కొలువుదీర్చి ఊరేగినారు.

వి.కోటలో..

వి.కోట: మండలంలో కేజీఎఫ్ రోడ్డు సమీపంలోని షిరిడీ సాయిబాబ ఆలయంలో స్వామి వారికి అభిషేకాలు, ప్రత్యేక పూజలు చేశారు. విశేషంగా అలకరించి ఉయ్యాలసేవ నిర్వహించారు. భక్తులకు అన్నదానం చేశారు. సాయంత్రం ఉత్సవమూర్తిని పల్లకిలో కొలువు దీర్చి పట్రపల్లెలో ఊరేగించారు. మహిళలు కర్పూర నీరాజనాలు సమర్పించారు. అలాగే దాసార్లపల్లెలోని శివాలయంలో కాశీవిశ్వేశ్వరుని శాకాంబరి అలంకారంలో భక్తులకు దర్శన భాగ్యం కల్పించారు.

ఘనంగా గురుపూజోత్సవం

శాంతిపురం: మండలంలోని కుతేగొనిపల్లి వద్ద ఉన్న పరమహంస యోగానంద పాఠశాలలో సోమవారం గురుపౌర్ణమి వేడుకలను ఘనంగా జరుపుకున్నారు. విద్యార్థులతో వారి తల్లిదండ్రులకు పాదపూజ చేయించారు. ఆది గురువు చిత్రపటానికి పూజలు చేసి చిన్నారులకు అక్షరాభ్యాసం నిర్వహించారు. పాఠశాల ప్రిన్సిపాల్ ఆజాద్‌హుస్సేన్, రాంచీకి చెందిన యోగాసత్సంగ్ సొసైటీ సభ్యులు పాల్గొన్నారు.

పుంగనూరు నియోజకవర్గంలో..

పుంగనూరు: నియోజకవర్గవ్యాప్తంగా గురుపౌర్ణమి సందర్భంగా సోమవారం ఆలయాలలో విశేష పూజలు నిర్వహించారు. భక్తులు అధికసంఖ్యలో పాల్గొని షిర్డీ సాయినాథున్ని దర్శించుకున్నారు. పుంగనూరు పట్టణంలోని కొత్తయిండ్లు, చెరువు కట్టపై, మాదనపల్లెలో ఉన్న శ్రీషిర్డీ సాయిబాబా ఆలయాల్లో ప్రత్యేక పూజలు నిర్వహించారు. అలాగే దత్త ఆలయాల్లో పూజలు చేశారు. మండలంలోని ఏడూరులో గల శ్రీలక్ష్మీనరసింహస్వామి ఆలయంలో గురుపౌర్ణమి సందర్భంగా స్వామివారిని ప్రత్యేకంగా అలంకరించి, హోమాలు నిర్వహించారు. మహా మంగళహారతి ఇచ్చి, భక్తులకు తీర్థప్రసాదాలు పంపిణీ చేశారు.

సోమలలో..

సోమల: స్థానిక షిరిడీ సాయి బాబా ఆలయంలో గురుపౌర్ణమి వేడుకలు ఘనంగా జరిగాయి. ఆలయంలో ఉదయం ప్రత్యేక పూజలు, అభిషేకాలు నిర్వహించారు. సాయంత్రం స్వామివారిని పల్లకిపై పురవీధుల్లో ఊరేగించారు.

సదుంలో..

సదుం: స్థానిక గాంధీరోడ్డులోని సాయిమందిరంలో గురుపౌర్ణమి వేడుకలను సోమవారం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఉదయం భక్తుల స్వహస్తాలతో బాబా విగ్రహానికి పాలాభిషేకం చేశారు. ఆలయంలో భక్తులకు అన్నదానం చేశారు.



వి.కోట : ప్రత్యేక అలంకరణలో సాయిబాబా



భక్తులకు అన్నదానం



పుంగనూరు: ఏడూరులో ప్రత్యేక పూజలు అందుకుంటున్న శ్రీలక్ష్మీనరసింహస్వామి

చౌడేపల్లెలో..

చౌడేపల్లె: స్థానిక బజారువీధిలో వెలసిన శ్రీ షిర్డీ సాయిబాబా ఆలయంలో సోమవారం వ్యాస గురు పౌర్ణమి వేడుకలు కనుల పండువగా జరిగాయి. బాబాకు అర్చనలు, అభిషేక పూజలు చేశారు. అనంతరం సాయిబాబాను వెండి సింహాసనంపై ప్రత్యేకంగా పుష్పాలతో అలంకరించి భక్తులకు దర్శనభాగ్యం కల్పించారు.

రొంపిచెర్లలో..

రొంపిచెర్ల: స్థానిక సాయిబాబా ఆలయంలో గురుపౌర్ణమి వేడుకలు వైభవంగా జరిగాయి. అనంతరం భక్తులకు ఆలయ పాలకవర్గం అన్నదానం ఏర్పాటు చేశారు.



చౌడేపల్లెలో..



సోమలలో..



సదుం: ప్రత్యేక అలంకరణలో సాయిబాబా



రొంపిచెర్లలో..